ఉద్యోగ, ఉపాధ్యాయులపై

వేధింపులు మానుకోవాలి

- పాతపెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి
- సకాలంలో జీతాలు చెల్లించాలి
- ధర్నాలో సిపిఎం - సిపిఐ పిలుపు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఉద్యోగ, ఉపాధ్యాయులపై రాష్ట్ర ప్రభుత్వం కక్షసాధింపు ధోరణి మానుకోవాలని గురువారం సిపిఎం- సిపిఐ జిల్లా కమిటీల ఆధ్వర్యంలో చిత్తూరు గాంధీ విగ్రహం వద్ద ధర్నా చేయడం జరిగింది. ఈధర్నానుద్దేశించి సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు, సిపిఐ జిల్లా కార్యదర్శి నాగరాజన్‌లు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులపై ప్రభుత్వ వేధింపులు మానుకోవాలని, సకాలంలో జీతాలు చెల్లించాలని, సిపిఎస్‌ను రద్దుచేసి పాత పెన్షన్‌విధానాన్ని పునరుద్ధరించాలని ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలు చేస్తున్న ఆందోళనకు మద్దతు ఈ ధర్నా చేస్తున్నట్లు తెలిపారు.

జగన్‌రెడ్డి పాదయాత్ర సందర్భంగా అధికారంలోకి వచ్చిన వారం రోజులలోపు సిపిఎస్ రద్దు చేస్తానని హామీ ఇచ్చారని, ఇచ్చిన హామీని అమలు చేయకపోగా గత సంవత్సర కాలంగా ఉద్యోగ, ఉపాధ్యాయులకు జీతాలు సకాలంలో చెల్లించకుండా తీవ్రఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. ఈనెల ఇప్పటికీ 60శాతం మంది ఉద్యోగ,ఉపాధ్యాయులకు జీతాలు, డిఎలు చెల్లించలేదని, డిఎ బకాయిల ఊసెత్తడం లేదన్నారు. ఆఖరికి వారి ఖాతాల్లో నిలువ ఉన్న సొమ్ము నుంచి పెట్టుకునే లోన్లు కూడా సుమారు 3వేల కోట్ల రూపాయలు గత రెండు సంవత్సరాలుగా చెల్లించకుండా ఆర్థిక ఇబ్బందులకు గురిచేస్తున్నారు. సిపిఎస్ రద్దు కోసం పోరాడుతున్న ఉద్యోగ,ఉపాధ్యాయులపై తీవ్రనిర్బంధాన్ని, అణచివేతను ఉపయోగిస్తూ అరెస్టులు, షోకాజ్ నోటీసులతో నిరంతరం బెదిరింపులకు పాల్పడుతున్నారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఎమ్మెల్సీ ఎన్నికలలో పాల్గొన్నారని షోకాజ్ నోటీసులు జారీ చేస్తున్నారని, ఎస్‌సి ఆర్‌టి డైరెక్టరుగా ఉన్న ప్రతాపరెడ్డి కడప ఆర్‌జెడి సహా కొందరు ఉన్నతాధికారులు ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడుతుంటే కట్టడి చేయలేని ప్రభుత్వం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో ఉపాధ్యాయులను పాల్గొనకూడదని ఆదేశించడం గర్హనీయం.ప్రజాస్వామ్యపద్ధతిలో చర్చలకు పిలిచి మాట్లాడి సమస్యలను పరిష్కారం చేయాల్సిన ప్రభుత్వం భయపెట్టి నిర్బంధాన్ని ప్రయోగించడం సరికాదన్నారు. పాఠశాలల పర్యవేక్షణ పేరుతో విద్యాశాఖ అధికారులు ఉపాధ్యాయులను మానసికంగా వేధింపులు గురిచేస్తుంటే విద్యార్థులకు నాణ్యమైన విద్య ఎలా వస్తుందో ప్రభుత్వమే సమాధానం చెప్పాలి. ఇప్పటికైనా రాష్ట్రప్రభుత్వం తన కక్షసాధింపు ధోరణిని విడనాడి సిపిఎస్ రద్దుతో సహా ఉద్యోగ,ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలన్నింటిని తక్షణం నెరవేర్చాలి. ఒకటో తేదీన జీతాలు చెల్లించాలన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులను మానసిక వేధింపులకు గురిచేయటాన్ని తక్షణం ఆపాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో సిపిఎం నాయకులు సురేంద్రన్, పి.చైతన్య, రాజశేఖర్, లీలా, బాలు, సిపిఐ నాయకులు చంద్ర, రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

గాంధీ విగ్రహం ఎదుట ధర్నా చేస్తున్న వామపక్ష పార్టీల నేతలు

ఉపాధ్యాయులపై వేధింపులు మానుకోవాలి

పలమనేరు: రాష్ట్రప్రభుత్వం ఉపాధ్యాయులపై వేధింపులు అరికట్టాలని వామపక్ష నాయకులు గురువారం డిమాండ్ చేశారు. పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్లో రాష్ట్రప్రభుత్వం ఉపాధ్యాయులపై అనుసరిస్తున్న తీరును నిరసిస్తూ వామపక్ష నాయకులు ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా వామపక్ష నాయకులు మాట్లాడుతూ సిపిఎస్ రద్దు చేస్తామని, మెరుగైన పిఆర్‌సి అందిస్తామని హామీలు ఇచ్చి మరచారని విమర్శించారు. వెంటనే ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇవ్వాల్సిన డిఎ బకాయిలను చెల్లించాలని, 1వ తేదీన జీతాలు చెల్లించాలని, సిపిఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఓబుల్ రాజు, భువనేశ్వరి, గిరిధర్ గుప్తా, కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈశ్వర్, గుర్రం సుబ్రహ్మణ్యం, పాకాల సుబ్రహ్మణం, రాజా, లక్ష్మయ్య, శ్రీరామయ్య, ఖైరునిషా, సిపిఐ నాయకులు మద్దెల సుబ్రహ్మణ్యం, జయంతి, మంజునాథ్, వెంకటేశులు, శంకరప్ప పాల్గొన్నారు.

పలమనేరులో ధర్నా చేస్తున్న వామపక్ష నేతలు

పరీక్షలకు వేళాయె..!

- 15 నుంచి ఇంటర్
- ఏప్రిల్ 3 నుంచి టెన్త్, ఓపెన్ స్కూల్ పరీక్షలు



ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:

ఏడాది అంతా కష్టపడి చదివిన విద్యార్థులకు ఏడాది చివర్లో నిర్వహించే పబ్లిక్‌పరీక్షలు అత్యంత కీలకం. పబ్లిక్‌పరీక్షలు అనగానే విద్యార్థులు ఒత్తిడికి గురికావాల్సిన అవసరం లేదంటున్నారు ఉపాధ్యాయులు. కరోనా కాలంలో పబ్లిక్ పరీక్షలు దాటుకొని క్లాసులు మారిన విద్యార్థులు గత ఏడాది నుంచి పబ్లిక్ పరీక్షలను ఎదుర్కోవాల్సి వస్తోంది.

ఈనెల 15వ తేదీ నుంచి ఇంటర్, ఏప్రిల్ 3వ తేదీ నుండీ టెన్త్, ఓపెన్ స్కూల్ పరీక్షలు నిర్వహణకు విద్యాశాఖ ఏర్పాట్లు చేస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులను ఫార్మేటివ్ 1,2 పరీక్షల ఫలితాల్లో సాధించిన ప్రగతి ఆధారంగా వీటిని ఏ, బి, సి, డి నాలుగు వర్గాలుగా విభించారు. వీరిలో ఏబి, సీడి రెండు గ్రూలుగా చేశారు. విద్యార్థులకు ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం ప్రత్యేక తగరతలు నిర్వహిస్తున్నారు. ఒక పిరియడ్ చదివించడం, మరో పిరియడ్ పరీక్ష రాయించడం జరుగుతోంది. కొత్తగా వచ్చిన టాప్ కార్యక్రమం గత నెల 27వ తేదీ నుంచి మార్చి 31వ తేదీ వరకు అమలు చేస్తున్నారు. పదో తరగతి పరీక్షలకు సిద్ధం అవుతున్న విద్యార్థులకు మోడల్ పేపర్ పేరుతో ఉపాధ్యాయులు శిక్షణ ఇస్తున్నారు. ఉత్తమ ఫలితాలు సాధించేలా టార్గెట్ ఓరియంటెడ్ ప్రోగ్రామ్ (టాప్) కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. ఈ మేరకు ఈకార్యక్రమం ద్వారా ఏప్రిల్ మూడు నుంచి పదో తరగతి పరీక్షల్లో నూటికి నూరుశాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా విద్యాశాఖ కసరత్తు చేస్తోంది.

ప్రీఫైనల్ ప్రారంభం..

టాప్ కార్యక్రమం అమలు చేయడంతో పాటు ఈనెల 9వ తేదీ గురువారం నుండీ పదో తరగతి విద్యార్థులు ప్రీఫైనల్ పరీక్షలు ప్రారంభమైయ్యాయి. జిల్లా విద్యాశాఖ నుంచీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో పదోతరగతి సిలబస్ పూర్తి చేయాలంటూ ఉపాధ్యాయులకు ఆదేశాలు అందాయి. కోవిడ్ రెండేళ్ల తరువాత గతేడాది పది పరీక్షలు జరిగాయి. విద్యార్థులు చాలా మంది ఉత్తీర్ణత సాధించలేకపోయారు. ఈ అనుభవాలను దృష్టిలో ఉంచుకొని పలు పాఠశాలలు ముందస్తుగానే టాప్ కార్యక్రమాన్ని ప్రారంభించాయి. గతేడాది అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ఈఏడాది ఉత్తమ ఫలితాలు సాధించేలా జిల్లా విద్యాశాఖ కసరత్తు చేస్తోంది.

పది పరీక్షలకు 21,996 మంది విద్యార్థులు

ఈ ఏడాది ఏప్రిల్ 3వ తేదీ నుంచి నిర్వహించనున్న పదో తరగతి పరీక్షలు 21,996మంది విద్యార్థులు రాస్తున్నారు. ఇందులో బాలురు 11,140 మంది, బాలికలు 10,556 మంది ఉన్నారు. అలాగే 115 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఏప్రిల్ మూడు నుండీ 18వ తేదీ వరకు ఉదయం 9.30గంటలకు పరీక్ష కేంద్రంలోకి మొబైల్‌ఫోన్, ఎలక్ట్రానిక్ పరికరాల అనుమతి ఉండదు. పరీక్షా కేంద్రాలలో సిటింగ్, లైటింగ్, తాగునీరు, మరుగుదొడ్లు ఉండే కేంద్రాలను ఎంపిక చేస్తున్నారు. విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవడంతో పాటు పరీక్షా కేంద్రాల వద్ద ఏఎన్ఎంల ద్వారా ఓఆర్ఎస్ ప్యాకెట్స్, తాగునీరు ఏర్పాటు చేస్తున్నారు. ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 1 గంటల వరకు పరీక్ష కేంద్రాల సమీపంలో ఉన్న జిరాక్స్ షాపులను మూసివేత, పరీక్ష కేంద్రాలలో అవసరమైన పోలీసు బందోబస్తు, పరీక్షలు జరిగే కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుంది. సమస్యాత్మక పరీక్ష కేంద్రాలలో సీసీ కేమరాలు ఏర్పాటు చేస్తున్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు

పగడ్బందీగా ఏర్పాట్లు పూర్తి

జిల్లా కలెక్టర్, రిటర్నింగ్ అధికారి ఎం. హరినారాయణన్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:

ప్రశాంత వాతావరణంలో ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు సిద్దంకావాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా పేర్కొన్నారు. గురువారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వర్చువల్ విధానంలో ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణపై కలెక్టర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు సిద్ధం కావాలన్నారు. ఓటరు స్లిపుల పంపిణీ పూర్తిచేయాలని, పోలింగ్ కేంద్రాలలో వెబ్‌కాస్టింగ్ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తిచేయాలని, ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనలు జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు చిత్తూరు జిల్లా నుండి కలెక్టర్, రిటర్నింగ్ అధికారి ఎం.హరినారాయణన్ పాల్గొని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి వివరాలను తెలియజేశారు. ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు పట్టభద్రుల, ఉపాధ్యాయుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పగడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని, ఆరు జిల్లాల డిఆర్‌ఓలు, ఆర్‌డిఓలతో సమన్వయం చేసుకోవడం ద్వారా ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసామన్నారు. పోలింగ్ నిర్వహణకు సంబంధించి ప్రిసైడింగ్ అధికారులకు, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ కార్యక్రమాన్ని పూర్తిచేయడం జరిగిందన్నారు. అలాగే మైక్రో అబ్జర్వర్లకు ఎన్నికల పరిశీలకుల సమక్షంలో శిక్షణా కార్యక్రమాలను నిర్వహించడం జరిగిందని, ఈనెల 11న మరోమారు శిక్షణా కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని, పోలింగ్ మెటీరియల్‌ను 4 రెవెన్యూ డివిజన్ కేంద్రాలైన చిత్తూరు, పలమనేరు, నగరి, కుప్పంలకు అందజేయడం జరిగిందన్నారు. బ్యాలెట్ బాక్సుల ప్రిపరేషన్‌కు సంబంధించి 287 బ్యాలట్‌బాక్సులను డిస్ట్రిబ్యూషన్ సెంటర్లలో అందుబాటులో పెట్టడం జరిగిందని, 100 పోలింగ్ కేంద్రాలలో (69 పట్టభద్రులు పోలింగ్ కేంద్రాలు, 31 ఉపాధ్యాయులు పోలింగ్ కేంద్రాలు) వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు, ప్రతి పోలింగ్ స్టేషన్‌లో వెబ్‌కాస్టింగ్ ఏర్పాటుతో పాటు డిజిటల్ అసిస్టెంట్‌ల ద్వారా పరిశీలించడం జరుగుతుందన్నారు. 11వ తేదీలోపు అన్ని పోలింగ్ కేంద్రాలలో వెబ్‌కాస్టింగ్ డెమో పూర్తి చేయడం జరుగుతుందని, చిత్తూరు జిల్లాకేంద్రంలో నిర్వహించే కౌంటింగ్ నిర్వహణకు సంబంధించి ఇదివరకే ఒకసారి కౌంటింగ్ సిబ్బందికి శిక్షణాకార్యక్రమం నిర్వహించడం జరిగిందని, మరో మారు ఈనెల 10వ తేదీన నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈనెల 16న ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్ చిత్తూరు ఆర్‌వివిఎస్ లాకాలేజీలో ఉపాధ్యాయుల నియోజకవర్గ ఎమ్మెల్సీ, ఆర్‌విఎస్ ఇంజినీరింగ్ కాలేజీలో పట్టభద్రుల ఎమ్మెల్సీ కౌంటింగ్ జరగనుండగా, మూడు షిఫ్ట్‌లలో విధులు నిర్వర్తించేందుకు 195మంది సూపర్వైజర్లు, 585 అసిస్టెంట్లును మొత్తం 780మందిని గుర్తించామని కలెక్టర్ వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు కలెక్టర్‌తో పాటు, జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్, డిఆర్‌ఓ ఎన్.రాజశేఖర్ ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు

జిల్లా ఎస్పీ రిషాంత్‌రెడ్డి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:

రాష్ట్రంలో ఈనెల 13వ తేదీన జరగబోయే ఎమ్మెల్సీ ఎలక్షన్స్ నేపథ్యంలో గురువారం చిత్తూరు జిల్లా ఎస్పీ జిల్లాలోని అధికారులతో పోలీసు గెస్ట్‌హౌస్‌లోని కాన్ఫరెన్స్‌హాల్‌లో సమావేశం నిర్వహించారు. ఎస్పీ రిషాంత్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికలకు పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేసి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎన్నికలను చాలా పారదర్శకంగా నిర్వహించాలని తెలిపారు. జిల్లాలో మొత్తం 33 పోలింగ్ కేంద్రాలున్నాయి. ఇందులో 16 కేంద్రాలను సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించి ఆ పోలింగ్ కేంద్రాలలో పోలీసు బలగాలతో పాటు అదనపు బలగాలను కూడా నియమించి ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా గట్టిచర్యలు తీసుకుంటామన్నారు.

పోలింగ్ తేదీ నాడు పోలింగ్ కేంద్రాల వద్ద ఏదైనా సమస్యలు జరిగితే ప్రిసైడింగ్ అధికారికి తెలియపరిచి సమస్యలను పరిష్కరించాలన్నారు. రౌడీషీటర్లను ముందుగానే గుర్తించి చట్టప్రకారం బైండ్‌ఓవర్ చేసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాలకు బ్యాలట్ బాక్సులను 12వ తేదిన పటిష్టమైన బందోబుస్తు నడుమ పంపుతామని తెలిపారు. ప్రతి మండల పరిధికి ఒక మొబైల్ పార్టీని నియమిస్తూ దానికి ఒక ఎస్ఐ స్థాయి అధికారి ఇంచార్జ్‌గా ఉంటారని, ఎలక్షన్ నియమావళి ప్రాకారం పోలింగ్ కేంద్రాలకు 100మీటర్ల వరకు ప్రజలు ఎవరు ఉండకుండా చూసుకోవాలన్నారు. అధికారులు వారి సిబ్బందికి ఎలక్షన్‌కి ముందు తగుసూచనలు చేసి ఒక చిన్నపాటి ట్రైనింగ్ కూడా ఇవ్వాలని ఆదేశించారు. ఏ రాజకీయ పార్టీ వారు కూడా ఓటర్లను తమ సొంత వాహనాల్లో పోలింగ్ కేంద్రాల వద్దకు తీసుకొని రాకూడదని ఇలాంటివి జరిగితే తీసుకోని వచ్చిన వాహనాన్ని సీజ్‌చేసి వాహనదారుడి పై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఓటింగ్ స్లిప్స్ లాంటివి పోలింగ్ కేంద్రాల వద్ద పంచకూడదని, ఎలక్షన్ నేపథ్యంలో అక్రమమద్యం రవాణ చేసే అవకాశాలు ఉన్నందున చెక్ పోస్టను పెంచి వాహన తనిఖీలు మరింత కఠినతరం చేయాలన్నారు.

పోలింగ్ ముందు రోజు ఎవరైనా డబ్బులు పంచితే వారిపై కేసులను నమోదు చేస్తామన్నారు. పోలీస్ సిబ్బంది ఎలక్షన్ అనంతరం బ్యాలట్ బాక్సులు స్ట్రాంగ్ రూమ్ చేరే వరకు పోలింగ్ కేంద్రాల వద్ద ఉంటారు. పోలింగ్ రోజున ప్రిసైడింగ్ ఆఫీసర్ మినహా ఎవరూ పోలింగ్ బూత్‌లోనికి ప్రవేశించకూడదన్నారు. పోస్టల్ బ్యాలెట్‌లకు దరఖాస్తు చేసుకున్న వారికి దానిని ఎలా ఉపయోగించుకోవాలనే దానిపై అధికారులు సూచనలు ఇవ్వాలన్నారు. పత్రికా విలేకరులకు కూడా పోలింగ్ కేంద్రలలోకి ఎటువంటి అనుమతి లేదని, తమ పార్టీ వారు గెలిచారని ఎటువంటి ముందస్తు సంబరాలు జరుపుకోకూడదన్నారు. ముఖ్యంగా అభ్యర్థులు ఎవరు ఓటర్లను ప్రలోభాలకు గురిచేయకూడదని అలా బలవంతంగా మద్యం, డబ్బులు ఇతర వస్తువులను ఇస్తే అది నేరం కింద పరిగణింపబడుతుందని దీనిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇలాంటి ప్రలోభాలకు ఎవరైనా గురిచేస్తే ఎలక్షన్ కమిషన్ వారికి గానీ, డయల్ 100 కు లేదా పోలీస్ వాట్స్ యాప్ నెంబర్ 9440900005కు సమాచారం ఇస్తే తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఏఆర్ జి.నాగేశ్వరరావు, ఎస్‌బి డిఎస్పీ శ్రీనివాసరెడ్డి, జిల్లాలోని డిఎస్పీలు, సిఐలు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలపై పోలీసు అధికారులతో సమీక్షిస్తున్న జిల్లా ఎస్పీ

రాష్ట్రంలో పారిశ్రామిక విప్లవానికి నాంది

నేత ఉత్పత్తిదారుల సమావేశంలో మంత్రి ఆర్కేరోజా

ప్రజాశక్తి- నగరి: విశాఖపట్నంలో ఈనెల 3,4 తేదీల్లో నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ విజయవంతం కావడం రాష్ట్ర పారిశ్రామిక విప్లవానికి నాంది అని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దార్శినికతకు, చిత్తశుద్ధికి నిదర్శనమని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజనసర్వీసుల, క్రీడాశాఖ మంత్రి ఆర్కే రోజా అన్నారు. గురువారం మున్సిపల్‌పరిధి ఏకాంబరకుప్పంలో నేత ఉత్పత్తిదారులతో ఆమె సమావేశమయ్యారు. నేతరంగంలో నెలకొంటున్న మార్పులపై చర్చించారు. వారికి ఎదురయ్యే సమస్యలపై ఆరాతీశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పారిశ్రామికంగా రాష్ట్రం ముందడుగు వేస్తోందన్నారు. సీఎం జగన్ బ్రాండ్ ఇమేజ్ వల్లే రాష్ట్రానికి పెట్టుడులు ప్రవాహంలా వస్తోందన్నారు. పర్యాటకరంగానికి రూ.21,941 కోట్ల పెట్టుబడులు పెట్టడానికి 129 ఎంఓయూలు జరిగిందన్నారు. 41,500 మందికి ఉద్యోగ అవకాశాలు రానుందన్నారు. ఇటీవల ఉత్తరప్రదేశ్, పంజాబ్, రాజస్తాన్, కర్ణాటకల్లో జరిగిన పెట్టుబడుల సదస్సుల్లో కూడా పర్యాటకరంగానికి సంబంధించి ఇంత భారీస్థాయిలో పెట్టుబడులు రాలేదన్నారు. జగనన్న విజన్ ఏంటో ఇప్పుడు అందరికీ అర్థమైందన్నారు. 6లక్షల మందికి ఉద్యోగాలు రావడం చిన్న విషయం కాదన్నారు. ప్రతి పక్షాలు చేసే దిగజారుడు రాజకీయాలు పక్కన పెట్టి పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వస్తున్నారన్నారు. కోవిడ్ రావడంతోనే ఈసమ్మిట్ ఆలస్యమైందన్నారు. సరైన సమయంలో ముఖ్యమంత్రి సరైన నిర్ణయం తీసుకున్నారని అన్నారు. రాయలసీమ వీవర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఆర్కే సెల్వమణి, రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ బాలకష్ణ, జిల్లా నేత అనుబంధ సంఘం అధ్యక్షులు కన్నాయిరం, బీఆర్వీ అయ్యప్పన్, పురుషోత్తం, భూపాలన్, మోహన్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ విధుల్లో అప్రమత్తంగా ఉండాలి : జెసి

శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు పట్టభద్రుల, ఉపాధ్యాయుల నియోజకవర్గ ఎంఎల్‌సి ఎన్నికల నిర్వహణలో భాగంగా పిఓలు, ఎపిఓలు పోలింగ్ విధులను సమర్థవంతంగా నిర్వహించేందుకు సిద్ధం కావాలని జిల్లా జాయింట్‌కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ పేర్కొన్నారు. ఈనెల 13వ తేదీన ఎంఎల్‌సి ఎన్నికల నిర్వహణలో భాగంగా ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులుగా నియామకం కాబడ్డ వారికి ఎన్నికల నిర్వహణకు సంబంధించి రెండవసారి శిక్షణా తరగతులు గురువారం పివికెఎన్ డిగ్రీకళాశాలలో ఏర్పాటు చేయడం జరిగింది. ఈశిక్షణా తరగతులను జిల్లా జాయింట్ కలెక్టర్ పరిశీలించారు. ఎఆర్‌ఓ, డిఆర్‌ఓ ఎన్.రాజశేఖర్ శిక్షణా తరగతుల నిర్వహణను పర్యవేక్షించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు పట్టభద్రుల, ఉపాధ్యాయులు నియోజకవర్గ ఎంఎల్‌సి ఎన్నికలు మార్చి 13న జరగనున్నాయని, పోలింగ్ ఉదయం 8 నుండి సాయంత్రం 4గంటల వరకు ఉంటుందన్నారు. పోలింగ్ నిర్వహణకు ఈనెల 12వ తేది ఉదయం 7గంటల కల్లా డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలైన డివిజన్ కేంద్రాలకు పిఓలు, ఎపిఓలు, ఓపిఓలు చేరుకుని పోలింగ్ మెటీరియల్‌ను తీసుకొని చెక్ లిస్టు ప్రకారం మెటీరియల్ (బ్యాలెట్‌బాక్సులు, పేపర్‌సీల్, రెండురకాల బ్యాలెట్ పేపర్స్, ఎలెక్టోరల్ రోల్స్ మొదలగునవి) ఉన్నది, లేనిది సరిచూసుకోవాలని అన్నారు. పిఓ, ఎపిఓ, ఓపిఓ, మైక్రో అబ్జర్వర్ అందరూ ఒక బందంగా వారికి కేటాయించిన పోలింగ్ స్టేషన్‌కు సాయంత్రంలోపు చేరుకొని రాత్రికి బస చేయాలన్నారు. పోలింగ్ కేంద్రంలో వసతులకు సంబంధించి ప్రతి పోలింగ్‌స్టేషన్‌లో బిఎల్‌ఓలు, వీఆర్‌ఓలను అనుసంధానం చేయడం జరిగిందని, వీరితో సమన్వయం చేసుకోవాలన్నారు. నిష్పక్షపాతంగా ఎన్నికల నిర్వహణకు ఎన్నికల సంఘం ప్రిసైడింగ్ అధికారులకు ఇచ్చిన హ్యాండ్ బుక్‌లోని అంశాలను క్షుణ్ణంగా అర్థం చేసుకుని ఎన్నికల నిర్వహణ రోజున బ్యాలెట్ బాక్సుల నిర్వహణ, బ్యాలెట్‌పేపర్లు, పిఓ డైరీలకు సంబంధించిన ఎటువంటి పొరపాట్లకు తావ్విరాదన్నారు. పోలింగ్ రోజున పోలింగ్ ఏజెంట్ లకు పాసుల పంపిణీ వారికి సీటింగ్ ఏర్పాట్లు ఉదయం 7గంటలకు పూర్తిచేసి 8గంటలకు పోలింగ్ ప్రారంభమయ్యేలా ప్రిసైడింగ్ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. పోలింగ్ నిర్వహణలో భాగంగా పోలైన ఓట్లు శాతాన్ని ప్రతిగంటకు ఒకసారి రిపోర్టును అందజేయాలన్నారు. పోలింగ్ పూర్తి అయిన అనంతరం ఏజెంట్ల సమక్షంలో బ్యాలెట్ బాక్సులను సీల్‌చేసి సంతకాలు తీసుకొని రెవెన్యూ డివిజన్ రిసెప్షన్ సెంటర్ స్ట్రాంగ్ రూమ్‌కు బ్యాలెట్ బ్యాక్‌లను చేర్చాల్సి ఉంటుందన్నారు. దీనితో పాటు పిఓ డైరీ ఇతర ప్రొఫార్మాలను అందజేయాలన్నారు. జెడ్పిసిఈఓ ప్రభాకర్‌రెడ్డి, సమగ్ర శిక్ష ఎపిసి వెంకట రమణారెడ్డి, చిత్తూరు, నగరి, పలమనేరు, కుప్పం ఆర్‌డిఓలు రేణుకా, సజన, శివయ్య, పిఓలు, ఎపిఓలు, పోలింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

భవన నిర్మాణాలను పూర్తి చేయండి

డిప్యూటీ సీఎం నారాయణస్వామి

ప్రజాశక్తి- కార్వేటినగరం: అర్ధాంతరంగా నిలిచిపోయిన ప్రభుత్వ డిగ్రీకళాశాల భవన నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి ఆదేశించారు. పనులు ఆగిపోయిన కళాశాల భవనాన్ని గురువారం సందర్శించారు. ఈసందర్భంగా డిప్యూటీ సిఎం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేస్తుందని, అలాంటి విద్యాలయాల నిర్మాణాన్ని అర్థాంతరంగా నిలిపి వేయకండని గుత్తేదారులను ఆదేశించారు. బిల్లులు మంజూరు కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి దష్టికి తీసుకెళ్లి మంజూరు చేయిస్తానని, ఆగిన పనులను వెంటనే ప్రారంభించి పూర్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే సంస్థానాధీశులు నిర్మాణం చేపట్టిన చారిత్రక కట్టడమై రాణిమహల్ మర్మమతుకు సీఎంతో సంప్రదించి త్వరలో నిధులు మంజూరుచేసి రాణీ మహల్‌కి పూర్వవైభవం తీసుకోస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట ఎంపీపీ లతబాలాజీ, మండల పార్టీ కన్వీనర్ ధనంజయవర్మ, ధనంజయరెడ్డి, హమీద్ ఖాన్, కార్తీక్‌రెడ్డి, పట్నం ప్రభాకర్ రెడ్డి, శేఖర్‌రాజు, చంద్రశేఖర్‌రాజు, పురందర్ ఉన్నారు.

భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఉపముఖ్యమంత్రి

ఉద్యోగ మేళాలో 86 మంది ఎంపిక

ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు

ప్రజాశక్తి- నగరి: స్థానిక ప్రభుత్వ డిగ్రీకళాశాలలోని జవహర్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో ఆర్కే ఎంటర్ ప్రైజస్ వారి సహకారంతో ఉద్యోగ మేళా నిర్వహించారు. ఈకార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ వేణుగోపాల్ అధ్యక్షోపన్యాసం చేస్తూ విద్య ఉద్యోగం జంట పదాలు అయినాయని, విద్య, పరిశ్రమల అవసరాలను తీర్చేదిగా మారిపోయిందని తెలిపారు. విద్యార్థులు పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను సాధించాలని సూచించారు. కళాశాలలో జరిగిన ఈ ప్రాంగణ ఇంటర్వ్యూలలో 86 మంది విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల ఇంచార్జ్ జేకేసీ కోఆర్డినేటర్ డాక్టర్ పంకజ తెలియజేశారు. రేణిగుంట సమీపంలోని డిక్సన్ టెలివిజన్ తయారీ కంపెనీలో ఎలక్ట్రానిక్ టీవీ మానుఫ్యాక్చరింగ్ ఆపరేటర్ ఉద్యోగాలకు కళాశాల, కళాశాలేతర విద్యార్థులు ఎంపికైనట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల జేకేసీ మెంటార్ లాల్‌బాషా, ఆర్కే ఎంటర్ ప్రైజస్ మానవ వనరుల విభాగం నుంచి దొరబాబు, కళాశాల వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ భాస్కరరాజు, అకడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ వేణుగోపాల్, ఐక్యూఏసి కోఆర్డినేటర్ మురళి మోహన్‌రెడ్డి, అధ్యాపకులు విజయబాబు, రామాంజులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉన్నత శిఖరాలు

జడ్పీ వైస్ ఛైర్మన్ ధనుంజయరెడ్డి

విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేస్తున్న ధనుంజయ రెడ్డి

ప్రజాశక్తి- యాదమరి: విద్య ద్వారానే విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదుగుతారని జడ్పీ వైస్‌చైర్మన్ బి.ధనుంజయ రెడ్డి అన్నారు. గురువారం కె.గొల్లపల్లి ఉన్నతపాఠశాల వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్పీ వైస్‌చైర్మన్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో కూడిన విద్య అభ్యసిస్తే మంచి భవిష్యత్తు, జీవితంలో అనుకున్న లక్ష్యాలు సాధిస్తారని తెలిపారు. పాఠశాల వార్షికోత్సవం సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలతో విద్యార్థులు అలరించారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. ఎంపిపి సురేష్‌కుమార్, వైస్‌ఎంపీపీ రవి, మనోహర్‌రెడ్డి, ఎంఈఓ రుక్మిణమ్మ, హెచ్‌ఎంలు రమేష్, గణపతి, అరుణ్ కుమార్, ఉపాధ్యాయులు కె.భాస్కర్‌రెడ్డి, నరసింహారెడ్డి, త్రివేణి మురళీధర్, మహేష్, షణుగ్మం, వాణి, భారతి, ఉష, భారతి, పద్మ, నాగరత్న, అరుణ, విష్ణుప్రియ పాల్గొన్నారు.

ఎంఈవోకు సత్కారం

ప్రజాశక్తి- నగరి: ఉత్తమ ఎంఈవోగా ఎంపికైన ఎంఈవో శ్రీదేవిని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు సత్కరించారు. గురువారం ఎమ్మార్సీ కార్యాలయంలో ఎంఈవోను కలిసిన వారు దుస్సాలువలతోను, జ్ఞాపికలతోను సత్కరించారు. సేవలను అలాగే కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రారెడ్డి, మున్సిపల్ సచివాలయ కన్వీనర్ దయానిధి, కౌన్సిలర్లు గోపాల్‌రెడ్డి, మునికష్ణారెడ్డి, ఇంద్రయ్య, దేశమ్మ దేవాలయ కమిటీ చైర్మన్ వేణుబాబు, మణి, అయ్యప్ప, సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

వేలంతో మున్సిపాలిటీకి ఆదాయం

ప్రజాశక్తి- నగరి: నగరి మున్సిపల్ పరిధిలో ఉన్న వారపు కూరగాయలు సంత, టాక్సీస్టాండ్, బస్టాండ్, దినసరి కూరగాయల మార్కెట్ వేలంపాటల్లో మున్సిపాలిటీకి గణనీయంగా ఆదాయం వచ్చిందని కమిషనర్ వెంకటరామిరెడ్డి తెలిపారు. 2023 ఏప్రిల్ 1వ తేదీ నుంచి 2024 వరకు రుసుం వసూలు చేసుకునే హక్కుకు నిర్వహించిన వారపు సంతకు సికె కపానిధి, దినసరి కూరగాయలు మార్కెట్‌కు సీఎం భాస్కర్, బస్టాండ్‌కు ఎస్.సుబ్రమణ్యం, టాక్సీ ఆటో స్టాండ్ ఎం.యోహాన్‌లు హెచ్చు పాటదారులుగా నిలిచారన్నారు. ఈ వేలం పాటల ద్వారా 64,09,760 రూపాయలు జిఎస్టీతో కలిపి ఆదాయం వచ్చిందని కమిషనర్ తెలిపారు.

స్వీపర్ల సమస్యలపై 17న చలో విజయవాడ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న స్వీపర్లు, ఆయాల సమస్యల పరిష్కారం కోసం మార్చి 17న విజయవాడలో జరిగే ధర్నాన్ని జయప్రదం కావాలని కోరుతూ గురువారం మంగసముద్రం హౌసింగ్ కాలనీలో కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ స్కూల్ స్వీపర్ల అండ్ ఆయాల వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు ఎస్. జయకుమారి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న స్వీపర్లు ఆయాల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడానికి తప్పుపట్టారు. పాఠశాల పరిసర ప్రాంతాలను పరిశుభ్రం చేసి విద్యార్థులు అనారోగ్యానికి గురికాకుండా బాత్రూంలను పరిశుభ్రం చేస్తున్న స్వీపార్ల అయాల సమస్యలు పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. 108 జీవో ప్రకారం 11,500 వేతనం ఇవ్వాలని, పెండింగ్ జీతాలు చెల్లించాలని, అమ్మ ఒడి పథకం నుండి కాకుండా ప్రత్యేకంగా టాయిలెట్ మెయింటినెన్స్ కింద బడ్జెట్ కేటాయించాలని, ప్రతినెలా క్రమం తప్పకుండా వేతనాలు ఇవ్వాలని, రాజకీయ వేధింపులు అరికట్టాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, గుర్తింపు కార్డు మంజూరుచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు కె.రమాదేవి, ఎస్.సరళాదేవి, కె.ప్రభావతి, కళావతి పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ నిబంధనలు తప్పనిసరి

ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు: ఆయా సచివాలయం పరిధిలోని అధికారులు ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ తప్పనిసరిగా పాటించాలని ఎంపీడీవో శ్రీదేవి ఆదేశించారు. మండలంలో గురువారం వెజ్జుపల్లి, నెలేపల్లి, కోటాగరం సచివాలయాలను గురువారం ఎంపీడీవో తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఎంపిడిఓ మాట్లాడుతూ గ్రామాల్లో ఇంకా అక్కడక్కడ వివిధ పార్టీ నాయకులకు చెందిన ఫ్లెక్సీలు ఉన్నట్లు తనకు ఫిర్యాదులు అందుతున్నాయని, అలాంటి వాటిని ఆయా సచివాలయం అధికారులు తొలగించాలన్నారు. అంతేకాకుండా మాజీముఖ్యమంత్రి విగ్రహాలు ఉన్నట్లయితే వాటికి ముసుగులు వేయాలని ఆదేశించారు.

నులిపురుగుల నివారణతోనే పిల్లల ఆరోగ్యాభివృద్ధి

భోజనం తిన్న తర్వాతనే మాత్రలు పంపిణీ : డిఆర్ఓ

మాత్రల పంపిణీపై వైద్యశాఖ అధికారులతో చర్చిస్తున్న డిఆర్ఓ రాజశేఖర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: పిల్లల కడుపులోని నులిపురుగుల నివారించడం ద్వారా పిల్లల ఆరోగ్యవద్ధి పొంపొందించి ఉన్నతపౌరులుగా తీర్చిదిద్దలన్నదే ప్రభుత్వ ముఖ్యఉద్దేశ్యమని డిఆర్ఓ ఎన్.రాజశేఖర్ పేర్కొన్నారు. గురువారం ఉదయం జిల్లా కలెక్టరేట్‌లోని డిఆర్ఓ సమావేశం హాల్‌లో జిల్లా వైద్య ఆరోగ్య, స్త్రీశిశుసంక్షేమం, విద్యా, సర్వశిక్ష అభియాన్, మున్సిపల్ కమిషనర్లు, జిల్లాపరిషత్, గ్రామీణ అభివద్ధి, జిల్లా గ్రామీణ నీటిపారుదలశాఖల అధికారులతో జిల్లాలో ఈనెల 14 నుంచి 18 వరకు (నేషనల్ డి- వార్మింగ్ డే) జాతీయ నులిపురుగుల నిర్మూలనదినం కార్యక్రమాన్నికి సంబంధించి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ పిల్లల కడుపులోని నులిపురుగుల నివారించడం ద్వారా పిల్లల ఆరోగ్యవద్ధి పొంపొందించి ఉన్నత పౌరులుగా తీర్చిదిద్దలన్నదే ప్రభుత్వ ముఖ్యఉదేశ్యమని సంవత్సరం నుండి 19 సంవత్సరపు లోపు అంగన్వాడీ కేంద్రంలోని పిల్లలకు, పాఠశాలలోను, కళాశాలలోను వివిధరకాల వసతి గహాలలోను, బడి బయట ఉన్న పిల్లలందరికీ ఈనెల 14 నుండి 18వ తేదీ వరకు నులిపురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేయాలన్నారు. దీనికి సంబంధించి సంబంధిత శాఖల అధికారులు సమన్వయం చేసుకుని విజయవంతంగా నిర్వహించాలన్నారు. పిల్లలు టిఫిన్, భోజనం తిన్న తర్వాతనే ఈమాత్రలు వేసుకోవాలన్నారు. ఈకార్యక్రమాన్ని జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని వైద్యాధికారులు, మండల పరిధిలోని మండల విద్యాశాఖ అధికారులు, సిడిపిఓలు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ల సుదర్శనం, రవిరాజు, శ్రీనివాసులు, డీఈఓ విజయేంద్రరావు, సాంఘికసంక్షేమశాఖ డిడి డాక్టర్ రాజ్యలక్ష్మి, ఐసిడిఎస్ పిడి నాగశైలజ, తదితరులు పాల్గొన్నారు.

హౌసింగ్ కాలనీలో ఇళ్లు నిర్మించుకోండి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జగనన్న హౌసింగ్ కాలనీలో ఇంటిస్థలాలు పొందిన లబ్ధిదారులు ఇళ్లను నిర్మించుకోవాలని, ఇందుకోసం అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అధికారులు అందిస్తారని నగర కమిషనర్ డాక్టర్ జె.అరుణ చెప్పారు. గురువారం సాయంత్రం కమిషనర్ నగరపాలక పరిధిలోని 26వ వార్డు సచివాలయాన్ని తనిఖీ చేశారు. వార్డు కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. స్పందన వినతుల పరిష్కారం, రికార్డుల నిర్వహణ, సంక్షేమ కార్యక్రమాల అమలుపై సమీక్షించారు. అనంతరం వార్డు పరిధిలోని హౌసింగ్ లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. పక్కా గహాలు నిర్మించుకోవాలని, ప్రభుత్వం అందించే సొమ్ములకు అదనంగా డ్వాక్రా సంఘాల నుంచి రుణాలు మంజూరు చేస్తామని చెప్పారు. ఇప్పటికే పునాదులు వేసిన వారు మిగిలిన నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ ముత్తు, నగరపాలక అధికారులు పాల్గొన్నారు.

26వ వార్డు సచివాలయాన్ని తనిఖీ చేస్తున్న కమిషనర్ అరుణ

విషజ్వరాలపై అవగాహన కల్పించాలి

జోనల్ మలేరియా అసిస్టెంట్ డైరెక్టర్ త్యాగరాజు

సర్వేను పరిశీలిస్తున్న కడప జోనల్ మలేరియా అసిస్టెంట్ డైరెక్టర్ త్యాగరాజు

ప్రజాశక్తి- యాదమరి: మండలంలోని ఆరిమాకులపల్లి గ్రామాన్ని కడప జోనల్ మలేరియా అసిస్టెంట్ డైరెక్టర్ త్యాగరాజు గురువారం తనిఖీ చేశారు. గడచిన ఒకటిన్నర సంవత్సరం క్రితం యాదమరి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలోని ఆరిమాకులపల్లి గ్రామంలో మలేరియా పాజిటివ్ కేసు నమోదైందని, ఆనాటి నుండి నేటి వరకు గ్రామంలో ఇంకో వ్యక్తికి మలేరియా పాజిటివ్ రాకుండా వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది ఫాగింగ్, రక్త నమూనాల సేకరణ, హెల్త్‌ఎడ్యుకేషన్ తదితర కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇదిలా ఉండగా చిత్తూరు జిల్లా పర్యటన నిమిత్తం వచ్చిన జోనల్ మలేరియా అసిస్టెంట్ డైరెక్టర్ గురువారం ఆకస్మికంగా ఆరుమాకులపల్లి గ్రామానికి వచ్చారు. అక్కడ వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది తీసుకుంటున్న చర్యలను చూసి సంతప్తి వ్యక్తం చేశారు. అనంతరం యాదమరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ల్యాబ్‌లో జరుగుతున్న పరీక్షలు రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో మలేరియా పాజిటివ్ కేసులు రాకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలకు ప్రాణాంతకమైన జ్వరాలుపట్ల క్షేత్రస్థాయి సిబ్బంది అవగాహన కల్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో సిహెచ్ఓ లక్ష్మీనారాయణ, ఏఎన్ఎంలు, ఎంఎల్‌పిహెచ్‌లు ఆశాలు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం పెట్టాలి

ప్రజాశక్తి -పాలసముద్రం: మండల పరిధిలోని ప్రభుత్వపాఠశాలలో విద్యార్థులకు జగనన్న గోరుముద్ద పతకంలో భాగంగా అందిస్తున్న మధ్యాహ్న భోజనం మెనూప్రకారం వేయాలని ఎంపీడీవో ఎస్.విద్యావతి తెలిపారు. గురువారం మండలంలోని శ్రీకావేరాజపురం ప్రాథమికోన్నత పాఠశాలను ఆమె సందర్శించారు. విద్యార్థులకు వండిన మధ్యాహ్న భోజనంను పరిశీలించారు. భోజనం తయారుచేసే నిర్వాహకులతో భోజనం పథకంలో తాజా కూరగాయలు, అయోడిన్ ఉప్పు వాడాలని సూచించారు. ప్రభుత్వం విద్యార్థులకు మంచి పౌష్టికాహారం అందించాలని ఉద్దేశంతో రోజుకో మెనూ పెట్టిందని, విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ గాలి మహేష్‌బాబు, హెచ్‌ఎం శ్యామలమ్మ, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వడ్డించిన భోజనాన్ని రుచి చూస్తున్న ఎంపీడీవో విద్యావతి

‘పిఎం మత్స్య సంపద’ను సద్వినియోగం చేసుకోండి

కమిషనర్ అరుణ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: నగరంలోని చేపల వ్యాపారస్తులు ప్రధానమంత్రి మత్స్య సంపద పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని నగర కమిషనర్ డాక్టర్ జె.అరుణ కోరారు. గురువారం నగరపాలక కార్యాలయంలో ప్రధానమంత్రి మత్స్యసంపద యోజన, ఫిష్ ఆంధ్ర - ఫిట్ ఆంధ్ర కార్యక్రమాలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మత్స్యకారులు, వ్యాపారస్తులు ఆర్థికంగా పురోభివద్ధి సాధించడం, శుభ్రమైన చేపల విక్రయాలు సాగించడం, ఆరోగ్యకరమైన చేపలను ప్రజలకు అందించడంలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రధానమంత్రి మత్స్య యోజన, ఫిష్ ఆంధ్ర - ఫిట్ ఆంధ్ర కార్యక్రమాల ద్వారా మినీఫిష్ రిటైల్ అవుట్లెట్లు, లైవ్‌ఫిష్ విక్రయకేంద్రాలు, రెస్టారెంట్లు, ఫిష్‌హబ్ ఏర్పాట్ల కోసం యూనిట్లను మంజూరు చేస్తుందన్నారు. రాయితీతో కూడిన యూనిట్లను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అందుబాటులో ఉన్న యూనిట్లు, రాయితీ వివరాలను మత్స్యశాఖ డీడీ రవికుమార్ వివరించారు. కార్యక్రమంలో ఎంహెచ్ఓ డాక్టర్ లోకేష్, శానిటరీ ఇన్స్పెక్టర్లు, చేపల వ్యాపారులు పాల్గొన్నారు.

ప్రీ ఫైనల్ పరీక్షలు ప్రారంభం

ప్రీ ఫైనల్ ప్రశ్నపత్రాలను అందజేస్తున్న ఎంఈవో లీలారాణి

ప్రజాశక్తి- పలమనేరు: 2022-23 అకడమిక్ సంవత్సరంలో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు ప్రీఫైనల్ పరీక్షలు గురువారం ప్రారంభమై 17వ తేదీన ముగుస్తాయని మండల విద్యాశాఖ అధికారి పి.లీలారాణి తెలిపారు. స్థానిక ప్రభుత్వ బాలుర పాఠశాలను సందర్శించారు. పరీక్షలకు సంబంధించి విద్యార్థులకు, ఉపాధ్యాయులకు పలు సూచనలు అందించారు. ఎంఈఓ మాట్లాడుతూ ప్రతిరోజూ ఆయా సబ్జెక్ట్ పరీక్షలు తేదీ ప్రకారం ఒక గంట ముందు ఎంఈఓ కార్యాలయం నుంచి పరీక్షా పత్రాలు తీసుకోవాలన్నారు. విద్యార్థులు పబ్లిక్ పరీక్షలుగా భావించి ఈ పరీక్షలకు కష్టపడి చదివి రాబోయే పబ్లిక్ పరీక్షలను కూడా బాగా రాయాలన్నారు.

గర్భిణులు వైద్యుల సలహాలు పాటించాలి

గర్భిణులకు వైద్యం చేస్తున్న డాక్టర్ దివ్య

ప్రజాశక్తి- గంగాధరనెల్లూరు: మండలంలోని తూగుంద్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం వైద్యాధికారి డాక్టర్ దివ్య, హెల్త్‌ఎడ్యుకేటర్ రాజేంద్రప్రసాద్ గర్భిణీలకు అవసరమైన పరీక్షలు నిర్వహించి, వారు తీసుకోవల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ప్రధాన మంత్రి సురక్ష మాతత్వ అభియాన్ పథకం కింద ప్రతినెలా 9వ తేదీ అవసరమైన పరీక్షలు నిర్వహించి, వారి ఆరోగ్యభద్రతపై అవగాహన కల్పించారు. ప్రతిగర్భిణీ మహిళలు పౌష్టికాహారం తీసుకొని ఆరోగ్యంగా ఉండాలని అన్నారు. అదేవిధంగా పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సలహాలు సూచనలు ఇచ్చారు. గర్భిణీ స్త్రీకి ఏ చిన్న సమస్య వచ్చినా ఆశాల ద్వారా తప్పక తెలియజేస్తే తగుచూచనతో జాగ్రత్తలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. పిహెచ్ఎన్ శాంతి, సూపర్వైజర్ వరలక్ష్మి, ఆశలు పాల్గొన్నారు.

రొంపిచెర్ల: మండల ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ రాజా ఆధ్వర్యంలో గురువారం ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ రాజా మాట్లాడుతూ గర్భిణులు గర్భం దాల్చినప్పటి నుంచి ప్రసవం అయ్యేవరకు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. రక్తహీనతకు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రతినెలా స్థానిక పిహెచ్‌సిలో పరీక్షలు చేయించుకోవాలని, రక్తపరీక్షలు, షుగర్, బీపీ పరీక్షలు తప్పనిసరిగా చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా వేసవిలో వచ్చే వైరల్ జర్వాలు, వడదెబ్బ వంటి వాటి నుంచి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల ఆరోగ్య వైద్యాధికారి ఎం.రాజేశ్వరి, సిహెచ్ఓ, పిహెచ్ఎన్, సూపర్వైజర్, ఎంఎల్‌హెచ్‌పిలు, ఆరోగ్యకార్యకర్తలు, ఆశాలు పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్యం చేస్తున్న డాక్టర్ రాజా

సంక్షిప్త వార్తలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రమాదంలో నుజ్జునుజ్జు అయిన కారు

ప్రజాశక్తి- వెదురుకుప్పం: మండలంలోని రాజాభావి కనుమ సమీపంలో జరిగిన రోడ్డుప్రమాదంలో ఓ వ్యక్తి మరణించారు. ఈ ప్రమాదానికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని పచ్చికాపలం (మీసేవ) భూపతిరెడ్డి (46) సొంతపనుల నిమిత్తం బుధవారం రాత్రి సొంత గ్రామం అయిన పచ్చికాపం నుంచి తిరుపతికి కారులో వెళ్లాడు. రాజాభావి కనుమ సమీపంలో ఎదురుగా వస్తున్న కారును ఢీకొనడంతో భూపతిరెడ్డి నడుపుతున్న కారు పక్కనే ఉన్న కాలువలో బోల్తాపడింది. ఈప్రమాదంలో భూపతి అక్కడిక్కడే మరణించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పుత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతునికి భార్య ఉంది. పోస్టుమార్టం అనంతరం మతదేహాన్ని పోలీసులు బంధువులుగా అప్పగించారు.

క్యాన్సర్ ఆస్పత్రిని త్వరగా నిర్మించాలి

ప్రజాశక్తి-తిరుపతి సిటి

స్విమ్స్ ఆసుపత్రి ప్రాంగణంలో నిర్మిస్తున్న శ్రీబాలాజీ ఇంటర్నేషనల్ సెంటర్ ఫర్ అడ్వాన్స్‌డే క్యాన్సర్ రీసెర్చ్‌కి సంబంధించిన భవనాల నిర్మాణం, డిజైన్లు, వైద్య పరికరాలు, సిబ్బంది సమీకరణ వంటి పనులన్ని నిర్ణీత సమాయానికి పూర్తి చేయాలని టిటిడి జేఈవో సదా బార్గవి సూచించారు. క్యాన్సర్ ఆసుపత్రి పనుల పురోగతిపై శ్రీపద్మావతి విశ్రాంతి గృహంలో గురువారం సమీక్ష నిర్వహించారు. ప్రతి పనికి నిర్ణీత కాల వ్యవధి పెట్టుకుని ఆలోగా పనులు పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో స్విమ్స్ డైరెక్టరు డాక్టరు బి.వెంగమ్మ, క్యాన్సర్ ఇన్స్టూట్ ప్రత్యేకాధికారి డాక్టరు జయచంద్రారెడ్డి, టిటిడి ఈఈ కృష్ణారెడ్డి, ఎ ంపిఎంఐడిసి ఈఈ ధనంజయరెడ్డి, స్కైడోమ్ సంస్థ ప్రతినిధి సుశీలఅధికారులు పాల్గొన్నారు.

ప్రపంచంలో అతిపెద్ద మహిళా సంస్థ ‘శ్రీజ’

ప్రజాశక్తి-తిరుపతి సిటి: ఆర్థిక స్వేచ్ఛ, సాధికారిత యొక్క అసలైన స్ఫూర్తిని చాటుతూ ప్రపంచంలో అతిపెద్ద మహిళా నిర్మిత యాజమాన్య సంస్థగా శ్రీజ నిలిచిందని శ్రీజ మహిళా మిల్క్ ప్రొడ్యూసర్ కంపెనీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ జయతీర్థచారి తెలిపారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాలలో ఘనంగా నిర్వహించామని, రాబోయే ఆర్థిక సంవత్సరంలో వేలాది మంది నూతన సభ్యులను చేర్చుకోనున్నట్లు వెల్లడించారు. ఆ సంస్థ చైర్‌పర్సన్ కె.శ్రీదేవి మాట్లాడుతూ తమ సభ్యుల సంఖ్యను రాబోయే ఏడాదికి 1.5 లక్షలకు చేర్చనున్నట్లు వెల్లడించారు. ఈ ప్రాంతంలో ప్రజలకు అత్యుత్తమ నాణ్యత కలిగిన పాలను అందించేందుకు తమ మహిళా సభ్యులు కట్టుబడి ఉన్నారన్నారు. గ్రామాల నుంచి స్టార్టప్స్‌ను అభివృద్ధి చేయడమనేది మహిళా శక్తికి అసలైన నిదర్శనంగా నిలుస్తుందన్నారు. ప్రస్తుతం ఈ కంపెనీ ఉమ్మడి తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడులో 11 జిల్లాలో విస్తరించి ఉందని, ప్రతి రోజు 5.5 లక్షల లీటర్ల పాలను సేకరిస్తుందని, ఈ ఆర్థిక సంవత్సరంలో 900 కోట్ల రూపాయలు మార్కు చేరుకుంటుందని అంచనా వేస్తున్నామన్నారు. అనంతరం అత్యున్నత ప్రదర్శన కనబరిచిన మహిళలను జిల్లాలతో పలు బల్క్‌మిల్క్ కూలింగ్ కేంద్రాల వద్ద సత్కరించారు.

అధికార గర్వాన్ని ఓడించండి : సిపిఎం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

ఈనెల 13వ తేదీన జరగనున్న తూర్పు రాయలసీమ ఎమ్మెల్సీ(పట్టభద్రులు, ఉపాధ్యాయులు) ఎన్నికల్లో అధికార పార్టీ గర్వాన్ని ఓడించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి మేధావులకు పిలుపునిచ్చారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో గురువారం ఆయన వామపక్ష పార్టీలు, వాటి అనుబంధ సంఘాల నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం గద్దెనెక్కాక నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేకుండా పోయాయని వాపోయారు. తరగతి గదుల్లో విద్యావంతులను తయారు చేయాల్సిన అధ్యాపకులపై యాప్ లు బోధనేతర పనులతో కక్ష సాధింపులు మొదలయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. జగన్ ప్రభుత్వం నూతన పిఆర్సి ని అమలు చేయకపోవడం కారణంగా ఒక్క ఉపాధ్యాయుడు రూ.25 లక్షల నుంచి రూ.30 లక్షలు నష్టపోతున్నాడని మండిపడ్డారు. ఏటా జాబ్ క్యాలెండర్ లేకపోవడం వలన ఎంతోమంది యువత వలస కార్మికులకు మారిపోతున్నారని ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరుద్యోగ యువతను, ఉపాధ్యాయులను ఇన్ని రకాలుగా వంచించినా జగన్ ప్రభుత్వం తగుదునమ్మా అంటూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓట్లు అడుక్కోవడం విడ్డూరంగా ఉందన్నారు. దొంగ ఓట్లు, డబ్బు, దౌర్జన్యాలతో గెలిచేందుకు అధికార పార్టీ వ్యూహరచన చేస్తోందనీ, మేధావి వర్గం ఓటర్లు ఆ పార్టీకి తగిన బుద్ధి చెప్పి పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు.

IN THE COURT OF THE HON'BLE JUNIOR CIVIL JUDGE NAGIRI
O.S.NO. 1 /2022
BETWEEN:
A.N. Thyagarajan ...Plaintiff
AND
1. M. Anand,
2. M.Ravi .....Defendants
SUIT SUMMONS TO DEFENDANT NO:1
M. Anand
S/o Late M.Mani Reddy,
Mittapalem Village,
Therani Post,
Nagari Mandal,
Chittoor District, A.P.
The Plaintiff herein filed above Original suit against you and another and the same is posted for your appearance before the above said Hon'ble Court on 17.03.2023 in person or through your advocate at about 10.30 am and file your objection if any, otherwise the matter will be decided Ex-Parte.
Date of hearing : 17/03/2023.
Sri. M.BABU, B.A., B.L
ADVOCATE,
NAGARI

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE :: PUTTUR
O.S.NO. 161 /2017
BETWEEN:
Melam Anand ...Plaintiff
AND
Melam Chandramma and others .....Defendants
SUIT SUMMONS TO DEFENDANT NO:5
To
D5. Pattem Jayanthi.
S/o P. Narayana,
S.N.Kandriga Village,
(Surappanaidu Kandriga)
D.M. Puram Post,
Karvetinagaram Mandal,
Chittoor District,
Please take suit Summons that the above case is posted for your appearance on 20.03.2023 before the Senior Civil Judge Court Puttur at 10.30 A.M failure to appear on the said date by you, the matter will be decided ex-parte.
By Order,
Sri. M. Mohan Raju, M.A., LL.B.,
ADVOCATE,
New Balaji Colony,
Tirupati.